సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



ఎన్నికలపై పాఠం!
విద్యార్థి దశ నుంచే ఎన్నికల ప్రక్రియ, ఓటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 10లో



మతోన్మాద పార్టీలను ఓడిద్దాం
ఈ ఎన్నికల్లో మతోన్మాద, ఫాసిస్టు పార్టీలను ఓడించాలని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
33° / 21°
జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. తెల్లవారు జామున మంచు, రాత్రికి చలి ఉంటాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాతా శిశు మరణాలను అరికట్టాలి

డీఎంహెచ్‌ఓ శిరీష



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

మణుగూరు టౌన్/మణుగూరురూరల్: మాతా శిశు మరణాలను అరికట్టి ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శిరీష అన్నారు. గురువారం ఆమె మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట, మండలంలోని కూనవరం పల్లె దవాఖానలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, ఈడీడీ క్యాలెండర్‌ను పరిశీలించి 30 సంవత్సరాలు దాటిన వారందరికీ (ఎన్‌సీడీ- స్క్రీనింగ్) షుగర్, రక్తపోటు పరీక్షలు నిర్వహించి ప్రతీ నెలా మందులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, స్పందన, శివకుమార్, నిశాంత్ రావ్, సంకీర్తన, డీపీఓ దుర్గ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు కొత్త మిర్చి

తేజా మిర్చి క్వింటాకు రూ.22 వేలు



మిర్చి రైతుతో మాట్లాడుతున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది రైతులు సాగు చేసిన మిర్చి పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం సూర్యాపేట జిల్లా మోతే మండలం భాగ్యనగర్ తండాకు చెందిన సూర్యానాయక్ ఎనిమిది బస్తాల మిర్చి తీసుకురాగా, క్వింటాకు రూ.22 వేల ధర పలికింది. మిర్చికి గతేడాది మంచి ధర రావడంతో రైతులు ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో జూన్‌లోనే నార్లు పోసి జూలైలో మిర్చిని నాటారు. ఆ మిర్చి సాగు ప్రస్తుతం కాత దశలో ఉండగా, మార్కెట్‌కు రావడం మొదలైంది.

ప్రచార హోరు..

జిల్లాకు వివిధ పార్టీల అగ్ర నాయకులు

- నేడు మణుగూరులో రాహుల్‌గాంధీ రోడ్ షో
- త్వరలో ఇల్లెందులో కేటీఆర్ ఎన్నికల యాత్ర
- భారీ సభ ఏర్పాట్లలో కమ్యూనిస్టు పార్టీలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఎన్నికల ప్రచారం వేడెక్కనుంది. నిన్నా మొన్నటి వరకు ప్రచార పర్వంలో భారత రాష్ట్ర సమితి ముందు వరుసలో ఉండగా.. ఇప్పుడు ఇతర పార్టీలు సైతం తమ ప్రచారంలో మరో అంకానికి తెర తీస్తున్నాయి. ఇంటింటి ప్రచారానికి తోడు ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాయి.

నేడు రాహుల్ రోడ్ షో

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మణుగూరులో రోడ్ షో నిర్వహించనున్నారు. నేడు ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరనున్న రాహుల్.. నేరుగా విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12.05 నిమిషాలకు మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఆయనకు స్థానిక కాంగ్రెస్ నేతలు స్వాగతం పలుకుతారు. 12.15 నుంచి 1.15 గంటల వరకు ఓపెన్‌టాప్ వాహనంలో రోడ్‌షో, అంబేద్కర్ సెంటర్‌లో జరిగే సభలో మాట్లాడుతారు. తిరిగి 1.25 నిమిషాలకు హెలికాప్టర్‌లో నర్సంపేటకు వెళ్తారు. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో ఎస్పీ డాక్టర్ జి. వినీత్, గురువారం మణుగూరులో ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రచారానికి వస్తుండడంతో జిల్లాకు చెందిన నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు, ఇతర నేతలు సైతం సభలో పాల్గొంటారు. రాహుల్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక్కసారిగా ఉత్సాహం వచ్చింది. మరోవైపు కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు బస్ యాత్రలో భాగంగా కొత్తగూడెం, భద్రాచలంలో పర్యటిస్తారు.

త్వరలో కేటీఆర్ రాక..

భారత రాష్ట్ర సమితి తరఫున సీఎం కేసీఆర్ ఇప్పటికే జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలను పూర్తి చేశారు. ఆ పార్టీ తరఫున సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కొత్తగూడెంలో, ఆదివారం భద్రాచలం, ఇల్లెందులో కేటీఆర్ రోడ్‌షో చేపట్టనున్నట్లు మొదట షెడ్యూల్ విడుదలైంది. అయితే అనివార్య కారణాలతో కొత్తగూడెం, భద్రాచలంలో కేటీఆర్ రోడ్‌షోలు రద్దయినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇల్లెందు నియోజకవర్గానికే రోడ్‌షో పరిమితం కానుంది.

25న పవన్ పర్యటన ?

ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన పార్టీలు కలిసి బరిలోకి దిగుతున్నాయి. జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలకు గాను కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు జనసేనకు కేటాయించారు. ఇక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం పవన్ కళ్యాణ్ జిల్లాకు వస్తారని తెలుస్తోంది.ఈ మేరకు బీజేపీ, జనసేన నేతలు పవన్‌తో చర్చలు జరుపుతున్నారు. ఈనెల 25న కొత్తగూడెంలో పవన్ రోడ్‌షో ఉండే అవకాశం ఉందని సమాచారం. ఇక బీసీ సీఎం నినాదంతో పోటీకి దిగిన బీజేపీ.. ఆ ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వీలుగా బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ పార్టీకి చెందిన ఎంపీలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి ఒకే చోట సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. అయితే తేదీ, వేదిక ఎక్కడ అనేది ఇంకా ఖరారు కాలేదు.

కదం తొక్కనున్న కామ్రేడ్లు

ఎన్నికల పొత్తు వికటించడంతో భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో సీపీఎం అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో భద్రాచలంలో ఆ పార్టీకి గట్టి పట్టు ఉంది. గత ఎన్నికల్లో ఈ విషయం రుజువైంది. దీంతో తెలంగాణ ఎన్నికల ప్రచారానికి వస్తున్న ఆ పార్టీ అగ్రనేతలు ఇక్కడ ప్రచారం చేయనున్నారు. ఈనెల 20న విజయ రాఘవన్, 25న త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, 27న పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ ప్రచారం నిర్వహించనున్నారు. ఇక కొత్తగూడెం నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తుండడంతో ఆ పార్టీ అగ్రనేతలు ఇప్పటికే కొత్తగూడెం ప్రచారంలో నిమగ్నమయ్యారు.

నన్ను అడ్డుకోలేకే..

మణుగూరులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రోడ్‌షో నిర్వహిస్తుండటంపై పినపాక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు స్పందించారు. 'ఇన్ని రోజులు నేనొక గల్లీ నాయకుడిని అనుకున్నాను. కానీ నా మీద పోటీ చేసే అభ్యర్థి గెలుపు కోసం ఢిల్లీ స్థాయి నేతలు ప్రచారానికి వస్తున్నారు. గత ఐదేళ్లలో పినపాకలో జరిగిన అభివృద్ధి, ఇక్కడి ప్రజలు నా వెన్నంటి ఉన్న తీరు చూస్తే, స్థానిక నేతలు నా గెలుపును అడ్డుకోలేరని ఆ పార్టీకి అర్థమైంది. అందుకే నన్ను ఓడించేందుకు ఢిల్లీ స్థాయి నేతను రప్పిస్తున్నారు. దీన్ని బట్టి రేగా ఎంత దమ్మున్న నాయకుడో తెలుస్తోంది' అన్నారు.

జంగ్ తెలంగాణ

పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ

వివరాలు వెల్లడించిన జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత జిల్లాలో 95 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని చెప్పారు. ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు 136 మంది అభ్యర్థులు 211 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారని, స్క్రూటినీలో 16 మందిని అనర్హులుగా తేల్చామని, మరో 25 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారని వివరించారు. ప్రస్తుతం పినపాక నియోజకవర్గంలో 18 మంది, ఇల్లెందులో 20, కొత్తగూడెంలో 30, అశ్వారావుపేటలో 14, భద్రాచలంలో 13 మంది పోటీలో ఉన్నారని తెలిపారు. వీరిలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల నుంచి 20 మంది, రిజిస్టర్డ్ పార్టీల నుంచి 28 మంది, స్వతంత్ర అభ్యర్థులు 47 మంది బరిలో నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే 4,500 మంది సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు, దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వారికి 725 పోస్టల్ బ్యాలెట్లకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసేలా ఈనెల 20 నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయాల ద్వారా షెడ్యూల్ తయారు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1095 పోలింగ్ కేంద్రాల్లో 300 సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, 512 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 2,93,73,711 నగదు, రూ. 2,48,01,333 విలువైన మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సీ- విజిల్ యాప్‌నకు ఫిర్యాదు చేస్తే 100 నిమిషాల్లో చర్య తీసుకుంటామన్నారు. ప్రచార అనుమతులు సువిధ యాప్ ద్వారా 48 గంటల్లో అందజేస్తామని, దీన్ని అన్ని పార్టీలు వినియోగించుకోవాలని కోరారు.

గుర్తింపు కార్డుతో హాజరవ్వాలి

పాల్వంచ : పోలింగ్ రోజున ఓటరు స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం ప్రకటించిన 15 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తీసుకుని రావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. పట్టణంలోని ప్రియదర్శిని పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారులు, సిబ్బందికి గురువారం పోలింగ్ స్లిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ స్లిప్ వెనుక బార్ కోడ్ ఉంటుందని, కోడ్ స్కానింగ్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం తెలుస్తుందని అన్నారు. రానున్న 3 రోజుల్లో పోలింగ్ స్లిప్‌ల పంపిణీకి నియోజవర్గాల వారీగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

రాహుల్ రోడ్‌షో ఏర్పాట్ల పరిశీలనలో ఎస్పీ వినీత్



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్, పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం, అధికారులు

మణుగూరు టౌన్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మణుగూరులో రోడ్‌షో, కార్నర్ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ వినీత్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఓఎస్‌డీ సాయిమనోహర్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబు, పినపాక కాంగ్రెస అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం ఆయన మణుగూరులో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాల పరిసరాల సమీపంలో హెలిప్యాడ్ ఉండటంతో కళాశాలను కొనసాగించి స్థలం చుట్టూ ఇనుప వలయం ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 11 గంటలకు అంబేద్కర్ సెంటర్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలపై డీఎస్పీ రాఘవేందర్ రావు, సీఐ రమాకాంత్‌తో చర్చించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

విద్యాభివృద్ధిలో తొలిమెట్టు, ఉన్నతి కీలకం

ఎస్‌సీఈఆర్‌టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్



నేలకొండపల్లి పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల అభివృద్ధిలో తొలిమెట్టు, ఉన్నతి కీలకపాత్ర పోషిస్తాయని ఎస్‌సీఈఆర్‌టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ తెలిపారు. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలును సువర్ణ వినాయక్ బృందం గురువారం జిల్లాలోని పలు పాఠశాలల్లో పర్యవేక్షించింది. అనంతరం ఖమ్మంలోని జెడ్పీ హాల్‌లో రిసోర్స్ పర్సన్లు, జిల్లాస్థాయి అధికారులతో సమావేశం కాగా, సువర్ణ వినాయక్ మాట్లాడుతూ.. నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తూ, ఉపాధ్యాయులకు ఎదురయ్యే సమస్యలను అధిగమించాలని సూచించారు. ఖమ్మం డీఈఓ సోమశేఖర శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌సీఆర్‌టీ ప్రొఫెసర్ రవికాంత, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణతో పాటు సురేశ్, పార్థసారథి పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశీలన..

నేలకొండపల్లి/కొణిజర్ల: విద్యాశాఖ రాష్ట్ర మానిటరింగ్ కమిటీ పరిశీలకుల ప్రతినిధి, ఎస్‌సీఈఆర్‌టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ ఆధ్వర్యాన నేలకొండపల్లి, కొణిజర్ల మండలంలోని పలు పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలుపై ఆరా తీయడంతో పాటు బోధనను పరిశీలించారు. ఆతర్వాత విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. బృందం సభ్యులు పి.ప్రభాకర్ రెడ్డి, అనిల్, ప్రసాద్, సునంద, ఎంఈఓలు బీ.వీ.రామాచారి, మోదుగు శ్యాంసన్‌తో పాటు చలపతిరావు, కె.వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

జ్యుడీషియల్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక



నియామక పత్రాలతో అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: జ్యుడీషియల్ ఉద్యోగుల జిల్లా అసోసియేషన్‌ను గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శిగా డీకొండ రవికుమార్, ట్రెజరర్‌గా లగడపాటి రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.మల్లికార్జున్, వైస్ ప్రెసిడెంట్లుగా ఇ.మీనాకుమారి, జి.ప్రమీల, కృష్ణకుమారి, హెచ్ సత్యనారాయణ, బి.మహేశ్వరావు, ఎం.స్వామినాథన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామకృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఆర్.శ్రీనివాస్, కోటేశ్వరావు వ్యవహరించారు.

హామీలపై నిలదీతలు

- భద్రాచలం అభివృద్ధిని పట్టించుకోని పాలకులు
- ప్రకటనలకే పరిమితమైన రూ.100 కోట్లు, రూ.వెయ్యి కోట్ల నిధులు
- పాలక వర్గంపై ప్రతిపక్షాలు, ప్రజల విమర్శలు
- ప్రచారంలో ఎదురవుతున్న ప్రశ్నలతో బీఆర్‌ఎస్ నేతల ఉక్కిరిబిక్కిరి



భద్రాచలం వద్ద కరకట్ట పైనుంచి గోదావరిలోకి విస్తరిస్తున్న డంపింగ్ యార్డు

భద్రాచలం: భద్రాచలం అభివృద్ధిపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు.. నేడు ప్రత్యర్థులకు అస్త్రాలుగా మారాయని ఆ పార్టీ నాయకుల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజల్లోకి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు పదేళ్లుగా ఇచ్చిన హామీలపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. భద్రాచలంలో కనీసం డంపింగ్ యార్డ్ సమస్య కూడా పరిష్కరించలేదని ప్రజలతో పాటు ప్రత్యర్థి పార్టీల వారు సైతం విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఓ వైపు ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేస్తున్నా.. గతంలో ఇచ్చిన హామీలే తమకు ఇబ్బందిగా మారాయని బీఆర్‌ఎస్ శ్రేణులు మథనపడుతున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి నిధుల జాడేది..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని సీఎం కేసీఆర్ తొలిసారి అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించారు. పలుమార్లు ఆ నిధులు విడుదల చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇక గతేడాది గోదావరి వరదల సమయంలో బాధితులను పరామర్శించేందుకు వచ్చిన కేసీఆర్.. ముంపు నిర్వాసితులకు ఎత్తయిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణంతో పాటు ఇరువైపులా కరకట్ట నిర్మాణానికి రూ.1000 కోట్లు ప్రకటించారు. ఇందులోనూ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు.

రాష్ట్ర విభజనలో అన్యాయంపై గగ్గోలు..

తెలంగాణ, ఏపీ రాష్ట్ర విభజనలో భద్రాచలానికి జరిగిన అన్యాయంపై ఇక్కడి ప్రజలు ఇప్పటికీ గగ్గోలు పెడుతున్నారు. భద్రాచలం మండలంలోని ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. దీంతో భద్రాచలం గ్రామపంచాయతీ ఒక్కటే మిగిలిపోయింది. రామాలయం, కాలనీలు మాత్రమే ఉండడంతో అభివృద్ధి జరగకపోగా.. పట్టణంలోని చెత్త, వ్యర్థాలు పడేసేందుకు కూడా స్థలం లేక గోదావరి కరకట్టపైనే డంపింగ్ యార్డు నిర్వహిస్తున్నారు. దాని చెంతనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించాల్సి వస్తోంది. చెత్త కాల్చితే వెలువడే పొగ, దుర్గంధంతో పరిసర కాలనీల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక విలీన పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలనే స్థానికుల డిమాండ్‌పై కేంద్రం, ఏపీ సర్కారుతో చర్చించి పరిష్కరిస్తానని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చినా నెరవేరలేదు.

మూడు పంచాయతీలతో మరో వివాదం..

ఏళ్ల తరబడి పాలక మండలి లేని భద్రాచలం గ్రామ పంచాయతీని ఇటీవల మూడు పంచాయతీలుగా విభజిస్తూ అసెంబ్లీలో బిల్లు రూపొందించి గవర్నర్ తమిళిసై ఆమోదానికి పంపారు. ఆమె మొదట తిరస్కరించగా.. అసెంబ్లీ సమావేశాల్లో ఆ బిల్లును రెండోసారి ఆమోదించి మళ్లీ గవర్నర్ వద్దకు పంపించారు. స్థానికుల అభిప్రాయం సేకరించకుండానే ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం ఇదని కాలనీ వాసులు నిలదీస్తున్నారు. దీనికి బీఆర్‌ఎస్ నాయకులు సైతం జవాబు చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి చర్యలు, గత హామీలు వారికి ఇప్పుడు తలనొప్పిగా మారుతున్నాయి. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తూ ఓట్లు అడుగుతున్నా.. భద్రాచలం సమస్యలపై మాత్రం తాము సరైన సమాధానం చెప్పలేకపోతున్నామని ఆ పార్టీ నాయకులు అంతర్గతంగా చర్చించుకోవడం గమనార్హం.

పేరుకే 'భద్రాద్రి' జిల్లా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన జనాభా, అనేక ప్రత్యేకతలతో వర్ధిల్లిన భద్రాచలం డివిజన్‌ను తెలంగాణ రాష్ట్ర సాధనలో జిల్లా కేంద్రంగా మారుస్తామని అనేక హామీలతో ఈ ప్రాంత ప్రజలను ఊరించారు. రాష్ట్ర విభజన తర్వాత కొత్తగూడెం కేంద్రంగా 'భద్రాద్రి కొత్తగూడెం' జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంతంపై వివక్ష చాటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో ఈ నియోజకవర్గంలో ఉన్న వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపారు. నాడు భౌగోళికంగా ఎనిమిది మండలాలతో విరాజిల్లిన భద్రాచలం నియోజకవర్గం రాష్ట్ర, జిల్లాల విభజనతో కేవలం ఐదు మండలాలకు పరిమితం కాగా, ఇందులో మూడు మండలాలు మాత్రమే జిల్లా పరిధిలో ఉన్నాయి.

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కాదు.. ఆర్‌ఎస్‌ఎస్

- అరవై ఏళ్లలో మైనార్టీలకు ఆ పార్టీ చేసిందేమీ లేదు
- రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ



ఖమ్మంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ పక్కన ఎంపీ నామా తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు కాదని.. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. కాంగ్రెస్‌లో 20 మంది సీఎం అభ్యర్థులు ఉండగా... బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ మాత్రమే సీఎం అని తెలిపారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణలో మైనార్టీల సంక్షేమానికి రూ.2,400 కోట్లు వెచ్చించగా, తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంతోపాటు మైనార్టీలు అభివృద్ధి చెందారని తెలిపారు. సీఎం కేసీఆర్ ముస్లిం పిల్లల కోసం స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటుచేయడమే కాక షాదీ ముబారక్ పథకంతో ముస్లిం ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక్కరోజు కర్ఫ్యూ విధించలేదని గుర్తుచేశారు. తెలంగాణ రాకముందు కరెంట్ కష్టాలు ఉండడమేకాక పరిశ్రమలు, రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరగలేదని.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పోయిందని తెలిపారు. అలాగే, మిషన్ భగీరథతో నీటి కష్టాలు తీరాయన్నారు. కాగా, ఓ సమావేశంలో తాను ముస్లిం మత పెద్దపై చెప్పిన మాటలను వక్రీకరించారని, తన మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగించి ఉంటే క్షమాపణ చెబుతున్నట్లు మహమూద్ అలీ పేర్కొన్నారు.

స్వతంత్ర అభ్యర్థులే అధికం

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 95 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ప్రధాన జాతీయ పార్టీల అభ్యర్థులు 20 మంది, గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు 28 మంది ఉన్నారు. అయితే అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థుల కంటే స్వతంత్రులే ఎక్కువగా ఉండడం గమనార్హం.

- పినపాక నియోజకవర్గంలో మొత్తం 18 మంది అభ్యర్థులు బరిలో ఉండగా జాతీయ పార్టీల నుంచి నలుగురు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి నలుగురు, స్వతంత్ర అభ్యర్థులు 10 మంది పోటీలో ఉన్నారు.
- ఇల్లెందు నియోజకవర్గంలో 20 మంది బరిలో నిలవగా ప్రధాన పార్టీల వారు ఐదుగురు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఆరుగురు ఉన్నారు. మరో తొమ్మిది మంది ఇండిపెండెంట్ అభ్యర్థులే.
- కొత్తగూడెంలో 30 మంది ఎన్నికల బరిలో ఉండగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి తొమ్మిది మంది, స్వతంత్రులు 19 మంది బరిలో ఉన్నారు.
- అశ్వారావుపేట నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రధాన పార్టీల నుంచి నలుగురు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఐదుగురు, స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు పోటీ చేస్తున్నారు.
- భద్రాచలం నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగా వారిలో ప్రధాన పార్టీల నుంచి ఐదుగురు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి నలుగురు, స్వతంత్ర అభ్యర్థులు నలుగురు పోటీ పడుతున్నారు.

క్లుప్తంగా

బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనాలి

సింగరేణి(కొత్తగూడెం): చట్టబద్ధంగా జరుగుతున్న బొగ్గు బ్లాక్‌ల వేలంలో రాజకీయ కారణాలతో పాల్గొనకపోతే సింగరేణి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని బీఎంఎస్ నాయకుడు, కోల్ సెక్టార్ ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు వేలంలో పాల్గొనడంతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు వసూలు చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్‌కు గురువారం ఆయన లేఖ రాశారు. బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొని సాధించడం ద్వారా సింగరేణి సంస్థ, కార్మికులకు ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈనెల 15న కేంద్రప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రారంభించిన బొగ్గు బ్లాక్‌లో వేలంలో పాల్గొనే విషయమై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

నాసా టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన పాఠశాల యాజమాన్యం

పాల్వంచ: 2023–24 సంవత్సరం నాసా నిర్వహించే నాసా స్పేస్ టాలెంట్ టెస్ట్‌కు పాల్వంచలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల నుంచి మొత్తం 33 మంది విద్యార్థులు ప్రాజెక్టులు పంపించేందుకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులకు ఏజీఎం జయప్రకాశ్ గురువారం పాఠశాలలో నాసా కిట్లను పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, డీన్ నాగేశ్వరరావు, నాగబాబు, వర్ధిని, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కోరం కనకయ్య వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇల్లెందు: ఎన్నికల విధుల్లో భాగంగా చెక్ పోస్టులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. గురువారం ఆయన కామేపల్లి మండలంలో ప్రచారం నిర్వహించి ఇల్లెందుకు వస్తుండగా కారేపల్లి క్రాస్‌రోడ్ చెక్ పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. కాగా, పోలీసులకు కనకయ్య సంపూర్ణంగా సహకరించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

భద్రాచలంటౌన్: జిల్లా కేంద్రంలో జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో భద్రాచలం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఈ పోటీలను గాంధీ గ్లోబల్, ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, సిద్ధార్థ యోగ విద్యాలయం, రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సంయుక్తంగా నిర్వహించారు. మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో భద్రాచలం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జ్యోత్స్న మొదటి, ధన్యశ్రీ రెండో బహుమతి సాధించారు. జ్యోత్స్నను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సుభాసిని, ఉపాధ్యాయులు అభినందించారు.

బావిలో పడి గేదె మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ గేదె మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బైరవునిపల్లి గ్రామంలో గురువారం రైతు బాలిన కృష్ణంరాజుకు చెందిన గేదె ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న బావిలో పడి మృతి చెందింది. ఆ తరువాత స్థానికులు నానా అవస్థలు పడి ట్రాక్టర్ ద్వారా బయటకు తీసిన ఫలితం లేకుండా పోయింది. గేదె విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

యువతి అదృశ్యం


సుజాతనగర్: యువతి అదృశ్యంపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. మండల కేంద్రానికి చెందిన ఓ యువతి ఈ నెల 14న తన తల్లిదండ్రులతో కలసి నిద్రించింది. తల్లిదండ్రులు తెల్లవారాక చూస్తే యువతి కనిపించలేదు. స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ తెలియరాలేదు. కాగా ఇదే గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

ఎన్నికలపై పాఠం!



ఖమ్మం శాంతినగర్ హైస్కూల్‌లో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- పదో తరగతి సోషల్ పుస్తకంలో పాఠ్యాంశం
- విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యంపై అవగాహన
- ఎన్నికల వేళ ప్రత్యేకంగా బోధిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికలంటే హడావుడి అంతా ఇంతా కాదు. అయితే, ఎన్నికలంటే ఓటు వేయడం, ఎమ్మెల్యేను ఎన్నుకోవడమే కాదు ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల ప్రక్రియ ఎంతో కీలకమైనది. ఈనేపథ్యాన విద్యార్థి దశ నుంచే ఎన్నికల ప్రక్రియ, ఓటింగ్, ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం పదో తరగతి సాంఘిక శాస్త్రం పుస్తకంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పేరిట పాఠాన్ని ముద్రించింది. ఓటు హక్కు విలువను తెలియచేయడం, స్వేచ్ఛగా ఓటు వేయాల్సిన ఆవశ్యకత, ప్రలోభాలకు లొంగకుండా సేవ చేసే నాయకుడినే ఎన్నుకోవాలనే సూచనలను ఇందులో పొందుపరిచారు. సాంఘిక శాస్త్రం పుస్తకంలోని ఎనిమిది పేజీల్లో ఎన్నికల ప్రక్రియ వివరాలను ఎనిమిది పేజీల్లో ముద్రించగా.. ప్రస్తుత ఎన్నికల నేపథ్యాన ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బోధిస్తున్నారు.

విద్యార్థి స్థాయి నుంచే...

పదో తరగతిలో ఎన్నికల ప్రక్రియపై పాఠ్యాంశాన్ని ముద్రించి బోధిస్తుండడం పౌరులుగా ఎదిగే విద్యార్థులకు తప్పనిసరని చెబుతున్నారు. అలాగే, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైతం ఓటింగ్ విధానం, స్వేచ్ఛగా ఓటు వేయడం, ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించే అవకాశముంది. కాగా, ఈ పాఠ్యాంశంలో భారత ఎన్నికల వ్యవస్థ ఏర్పాటు, విధులు, ప్రతిపత్తి తదితర విషయాలను వివరించారు. అలాగే, 1950 జనవరి 25న ఏర్పడిన భారత ఎన్నికల సంఘం, తదనంతరం కాలంలో వచ్చిన మార్పులు, ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టీఎస్.శేషన్ విధులు నిర్వర్తించిన సమయాన చేపట్టిన చర్యలను పేర్కొన్నారు.



పదో తరగతి సోషల్ పుస్తకంలోని ఎన్నికల పాఠ్యాంశం

అవగాహన ఇలా..

పదో తరగతి పాఠ్యాంశంలో భారత ఎన్నికల వ్యవస్థ, భారత ఎన్నికల సంఘం, ఎన్నికల సంఘానికి స్వయం ప్రతిపత్తి, ప్రధాన ఎన్నికల కమిషనర్ విధులు, ఓటింగ్ ప్రక్రియ, ఎన్నికల సమయంలో అధికార పార్టీ ఎలాంటి కార్యక్రమాలను చేపట్టవద్దు, ఓటరు ప్రతిజ్ఞ, వివిధ స్థాయిల్లో ఎన్నికల నిర్వహణ, నోటా, ఎన్నికల సంస్కరణలు, ఈవీఎం, కంట్రోల్ యూనిట్ల పనితీరును సమగ్రంగా వివరించారు.

అమ్మానాన్నకు వివరించా...



ప్రజాస్వామ్యంలో సుపరిపాలన అందించే వ్యక్తులను ఎన్నుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని తెలిసింది. పాఠంలోని వివరాలు ఆధారంగా మా ఉపాధ్యాయులు అన్ని విషయాలు వివరించారు. దీంతో ఓటు వేయడం ఎంత తప్పనిసరో మా అమ్మానాన్నకు చెప్పా.

– ఎస్.వెంకటశివ, పదో తరగతి, శాంతినగర్ హైస్కూల్, ఖమ్మం

విద్యార్థి దశ నుంచే అవగాహన



పదో తరగతి సోషల్ పుస్తకంలో ఎన్నికల ప్రక్రియపై పాఠ్యాంశాన్ని ముద్రించటం అభినందనీయం. తద్వారా విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించడం సాధ్యమవుతుంది. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఈ పాఠం బోధిస్తే విద్యార్థులు ఆసక్తి విన్నారు.

– వి.యాదగిరి, సోషల్ ఉపాధ్యాయుడు, మంగళగూడెం

అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలి



ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలని మా సార్ చెప్పారు. తద్వారా మంచి జరుగుతుందని వివరించాడు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ పాఠం చెప్పడంతో అనేక విషయాలు తెలిశాయి.

– ఎస్.గోపీచందన, పదో తరగతి, మంగళగూడెం హైస్కూల్

మీ గుర్తు మీకే...!

- జాతీయ, గుర్తింపు పొందిన పార్టీలకు శాశ్వతం
- మిగతా పార్టీలకు ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి కేటాయింపు



వైరా: ఎన్నికల్లో పోటీ చేసే జాతీయ, ప్రాంతీయ పార్టీలకు వారి రిజిస్టర్డ్ గుర్తులను ఎన్నికల సంఘం కేటాయిస్తుంది. ఒక సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఏవైనా నాలుగు రాష్ట్రాల ఓట్లలో నాలుగు శాతం సంపాదించగలిగితే దాన్ని జాతీయ పార్టీగా ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. ఒక పార్టీ రాష్ట్రం లేదా ఒక ప్రాంతంలో నాలుగు శాతం ఓట్లు సాధిస్తే దాన్ని ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తారు. ఆతర్వాత వీరికి ఎన్నికల సంఘం గుర్తులు కేటాయిస్తుంది. అయితే, సిద్ధాంత రీత్యా, వ్యక్తుల వల్లకానీ పార్టీ చీలిపోయినప్పుడు ఆ పార్టీ గుర్తును ఏ వర్గానికి కేటాయించాలన్న వివాదం ఏర్పడితే ఎన్నికల సంఘం సమస్యను పరిష్కరిస్తుంది.

జాతీయ పార్టీలు...

దేశంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు ఏడు ఉన్నాయి. వీటికి ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులను మరే పార్టీకి కానీ, స్వతంత్రఅభ్యర్థులను కానీ కేటాయించదు. దేశంలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, బహుజన సమాజ్‌పార్టీ, భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీలు జాతీయ పార్టీలుగా గుర్తింపు సాధించాయి.

రిజిస్టర్డ్, అన్ రికగ్నైజ్డ్ పార్టీలు

జాతీయ పార్టీలతో పాటు రిజిస్టర్డ్, అన్ రికగ్నైజ్డ్ పార్టీల తరఫున కూడా అభ్యర్థులు పోటీలో ఉంటారు. ఈ పార్టీలను కొందరు వ్యక్తులు, సంస్థల పేరిట ఎన్నికల సంఘం వద్ద నమోదు చేస్తారు. ఎన్నికల్లో పోటీ చేసినా.. చేయకపోయినా అవి అలాగే కొనసాగుతుంటాయి. ఒకవేళ పోటీ చేస్తే ఆ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల సమయాన ఎన్నికల సంఘం ఫ్రీ సింబల్స్‌గా ఉంచే వాటి జాబితా నుంచి గుర్తు కేటాయిస్తుంది. అయితే వారికి ఇండిపెండెంట్ అభ్యర్థుల కన్నా ముందు గుర్తులు ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం మన దేశంలో సుమారు 1,983 రిజిస్టర్, అన్ రికగ్నైజ్డ్ పార్టీలు ఉన్నాయి. ఇవి తెలంగాణలో 73 వరకు ఉన్నాయి. అదే విధంగా 164 ఫ్రీ సింబల్స్ అందుబాటులో ఉంటాయి.

రూ.3.20 కోట్ల విలువైన మద్యం స్వాధీనం



నిందితులు, మద్యంతో పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో జిల్లాలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3,20,67,293 విలువైన మద్యం, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా 2791.5లీటర్లు, మద్యం 1268.5లీటర్లు, బీర్లు 138.45లీటర్లు, గంజాయి 304.45 కేజీలు, వాహనాలు–32, సెల్ ఫోన్లు –18 సీజ్ చేశామని అధికారులు తెలిపారు.

నారాయణపురంలో..

అశ్వారావుపేటరూరల్: ఎక్సైజ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగయ్య కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామంలో దాడులు నిర్వహించి రాయగిరి వరప్రసాద్ అనే వ్యక్తి వద్ద రూ.25వేల విలువైన 80 మద్యం సీసాలు, 12 బీర్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అధికారులు చంద్రశేఖర్, హరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగదు సీజ్

దమ్మపేట: ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును ఎఫ్ఎస్ టీం ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సీజ్ చేశారు. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపునకు వెళ్తున్న కారును మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేసి రూ.72,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ తెలిపారు.

మతోన్మాద, ఫాసిస్ట్ పార్టీలను ఓడిద్దాం

- అదానీ, అంబానీల సేవలో తరిస్తున్న కేంద్రం
- కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థికి మద్దతు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మతోన్మాద, ఫాసిస్ట్ బీజేపీతో పాటు ఆ పార్టీతో అంటకాగుతున్న బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల అభ్యర్థులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో 2014 నుంచిప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగుతుండగా, ప్రజాస్వామ్య హక్కులను పాలకులు కాలరాశారని విమర్శించారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వానికి నియంత్రణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంటూ అదానీ, అంబానీల సేవలో తరిస్తున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతూ సామాన్యులపై భారం మోపారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు పైకి వేర్వేరుగా కనపడుతున్నా అవి స్వార్థప్రయోజనాల కోసం కలిసే పనిచేస్తున్నాయని రంగారావు చెప్పారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు విఫలం కాగా, బంజరు, అటవీ, పోడు, దేవాలయ భూములకు పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. కాగా, ఎన్నికల్లో తాము అశ్వారావుపేట, సత్తుపల్లి, సూర్యాపేటలో పోటీ చేస్తుండగా, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, ఇల్లెందులో గుమ్మడి అనురాధకు మద్దతు ఇస్తున్నట్లు రంగారావు తెలిపారు. డబ్బు సంచులతో ప్రలోభాలకు గురిచేస్తున్న నేతలకు గుణపాఠం చెప్పేలా ప్రజలు మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు రాయల చంద్రశేఖర్, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, సీ.వై.పుల్లయ్య, జి.రామయ్య, శిరోమణి, ఝాన్సీ, ఆజాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుతో మేలు

వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ సైంటిస్ట్ ప్రగతి



సదస్సులో మాట్లాడుతున్న సైంటిస్ట్ ప్రగతి

చింతకాని: యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ సైంటిస్ట్ సీహెచ్.ప్రగతి సూచించారు. చింతకాని మండలంలోని బస్వాపురం రైతువేదికలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత సమన్వయ పరిశోధన సంస్థ, వైరా కేవీకే, మధిర వ్యవసాయ పరిశోధన స్థానం సంయుక్త ఆధ్వర్యాన ఆరుతడి పంటలపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రగతి మాట్లాడుతూ.. వరి పంటకు బదులుగా పెసర, మినుము పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందొచ్చని తెలిపారు. అలాగే, యాసంగిలో వేరుశనగ, మంచిశనగ పంటల సాగుతో భూమిలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక మొక్కజొన్న సాగుతో అధిక దిగుబడి లభించడమేకాక చీడపీడల ఉధృతి కూడా ఉండదని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవర్ధన్, వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శైలజ, మధిర వ్యవసాయ పరిశోధన స్థానం సైంటిస్ట్ డాక్టర్ రుక్మిణీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌రెడ్డి, డాక్టర్ భరత్, డాక్టర్ ఫణిశ్రీ, డాక్టర్ అలీబాబా, ఏఓ పల్లెల నాగయ్య, ఏఈఓలు ఆయేషా, రజిత, హరికృష్ణ, కార్తీక్, గోపి, తాహియా నౌషీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని యువకుడి మృతి

సత్తుపల్లిరూరల్: ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. వేంసూరు మండలం నాయకన్‌గూడెంకు చెందిన పుచ్చా ప్రసాద్(25) పెయింటింగ్ పని కోసం గురువారం సత్తుపల్లి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు.ఈక్రమంలోసత్తుపల్లి మండలం రేజర్ల సమీపాన ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆయన వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, కుమార్తె ఉండగా కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి..

తిరుమలాయపాలెం: మండలంలోని పాపాయిగూడెం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలు శివారు పాపాయిగూడెం గ్రామానికి చెందిన రేపాకుల రాజు(35) మోటార్‌సైకిల్‌పై పిండిప్రోలు వెళ్తుండగా వరంగల్ నుంచిఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజు తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కూలీ పనులు చేసుకుని జీవించే ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోలింగ్ సిబ్బందికి ఆరోగ్య కిట్లు



సిబ్బందికి ఇవ్వనున్న మందుల కిట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఈనెల 30 తేదీన జరిగే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వైద్య ఆరోగ్య శాఖ కిట్లు అందించనుంది. ఖమ్మం కలెక్టర్ వీ.పీ గౌతమ్ ఆదేశాల మేరకు తొలిసారిగా సిబ్బంది కోసం ప్రత్యేక మందుల కిట్ సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఒకరోజు ముందుగా వెళ్లే సిబ్బందికి అనారోగ్యం సమస్యలు ఎదురైతే ఉపయోగపడే మందులతో కిట్ తయారుచేశారు. ఈ కిట్‌లో తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరోచనాలు, ఇతర చిన్న చిన్న సమస్యల నివారణకు ఉపయోగపడే మందులే కాక దూది ఇతరత్రా ఉంటాయి. మొత్తం 1,500 కిట్లను సిబ్బందికి ఇవ్వనుండగా, పోలింగ్ రోజున కేంద్రాల్లో వైద్యసేవలందించేందుకు సిబ్బందిని నియమిస్తున్నారు.

జీవావరణ వ్యవస్థపై అవగాహన అవసరం



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

కొత్తగూడెంఅర్బన్: పర్యావరణం, జీవావరణ వ్యవస్థలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని.. తద్వారా జీవుల మధ్య సమన్వయం ఏర్పడుతుందని రాష్ట్ర గ్రీన్ కోర్ కార్ప్(ఎన్‌జీసీ) ప్రతినిధులు తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 'సుస్థిర అభివృద్ధి–జీవనశైలి' అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి పర్యావరణ శాఖ అడిషనల్ జనరల్ మేనేజర్ కె.రవికిరణ్ పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం భద్రాద్రి జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు మాట్లాడుతూ.. పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడితేనే మనుషుల మనుగడ సాఫీగా సాగుతోందని తెలిపారు. ఇప్పటికే వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నందున పర్యావరణానికి హాని కలిగించేలా ప్రవర్తించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ మేనేజర్ శివరాం, సంపత్‌కుమార్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చండ్రుగొండ : మండలంలోని తుంగారం పంచాయతీ సుంకరబంజర్‌లో వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటనలో గురువారం ముగ్గురి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాచినేని రవి కథనం ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న మాలోత్ మంగీలాల్ బుధవారం రాత్రి అదే గ్రామంలోని మాలోత్ వీరన్న ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసి గాయపరిచిన వీరన్నతోపాటు అతడి భార్య దివ్య, తల్లి రాణిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు

పాల్వంచ: అక్రమంగా బెల్ట్‌షాపు నడుపుతున్న వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని అల్లూరి సెంటర్ వద్ద కిరాణా షాపులో మద్యం నిల్వ ఉంచి అమ్మకం చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ రాఘవయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. షాపులో నిల్వ ఉంచిన సుమారు రూ.13,200 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడు బానోతు బాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి ట్రాక్టర్ల స్వాధీనం

బూర్గంపాడు: కృష్ణసాగర్ ఫారెస్ట్ బీట్ పరిధిలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. దేవయ్యగుంపు సమీపంలోని అటవీభూముల నుంచి అక్రమంగా మట్టిని తోలుతున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని బుధవారం రాత్రి ఫారెస్ట్ అధికారులు పట్టుకుని భద్రాచలం ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్ఓ ప్రసాద్, అశ్వాపురం ఎఫ్ఆర్ఓ రమేష్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.